RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, జూన్ 22, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 61 | పేజీలు: 8 | వెల : రూ.1



మరింత తీవ్రంగా దాడి చేస్తాం...

## ఇరాన్‌కు ట్రంప్ మరోసారి వార్నింగ్



# భారీ భద్రత నడుమ నీట్ రీ ఎగ్జామ్ ప్రారంభం

దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠకు కారణమైన నీట్ యూజీ 2026 పునఃపరీక్ష నేడు (జూన్ 21) ప్రారంభమైంది. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలతో మే 3న జరిగిన పరీక్ష రద్దు కావడంతో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ పరీక్షను మళ్లీ నిర్వహిస్తోంది. ఈసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో మొత్తం 5,440 కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోంది. 22 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష సాయంత్రం 5:15 గంటలకు ముగుస్తుంది. ఇది పూర్తిగా పెన్ అండ్ పేపర్ విధానంలో ఆఫ్ లైన్‌లో జరుగుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను నిలబెట్టేందుకు ఈసారి పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద 1.38 లక్షల సీసీటీవీ కెమెరాలు, 51,000కు పైగా జామర్లు ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ వెరిఫికేషన్ తర్వాతే విద్యార్థులను లోపలికి అనుమతించారు. ప్రశ్నపత్రాల భద్రత కోసం భారత వైమానిక దళం సహకారం కూడా తీసుకున్నారు. లీక్‌లు, తప్పుడు ప్రచారాలను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు, సైబర్ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు కొత్త అడ్మిట్ కార్డు, ఫొటో ఐడీతో నిబంధనల ప్రకారం గంటల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

# బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం: సింగరేణి యాజమాన్యం



సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు,

(మిగతా 2వ పేజీలో)



## భారత్ ఇంధన భద్రతకు భారీ ఊరట..

# హర్మూజ్ దాటిన 3 ఆయిల్ ట్యాంకర్లు

**8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో భారత్‌కు ప్రయాణం**

**కేంద్ర మంత్రి సోనోవాల్ ప్రకటన..**

**ప్రభుత్వ సమన్వయంతోనే సాధ్యమైందని వెల్లడి**

**అమెరికా-ఇరాన్ ఒప్పందం తర్వాత సడలిన**

**ఆంక్షలతో తిరిగి ప్రారంభమైన నౌకల రాకపోకలు**

**దేశ ఇంధన భద్రతకు ఈ పరిణామం అత్యంత కీలకమని విశ్లేషణ**



భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూడు భారతీయ జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఈ జలమార్గంలో రవాణా తిరిగి ప్రారంభం కావడం భారత్‌కు శుభపరిణామం. ఈ విషయాన్ని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా ప్రకటించారు. 'దేశ్ వైభవ్', 'దేశ్ విభోర్', 'సన్మార్ హెరాల్డ్' అనే మూడు నౌకలు 94 మంది భారత సిబ్బందితో హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు ఆయన తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీ గారి నిర్ణయాత్మక నాయకత్వంలో భారత ప్రభుత్వం దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మన నావికుల భద్రత, దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణ కోసం మా మంత్రిత్వ శాఖ అన్ని సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది" అని సోనోవాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం ఈ మూడు నౌకలు జూన్ 24 నుంచి జులై 1 మధ్య భారత తీరానికి చేరుకోనున్నాయి. 'దేశ్ వైభవ్' జూన్ 24న గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు, 'దేశ్ విభోర్' అదే రోజున సిక్కా పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. ఇక జూన్ 20న హర్మూజ్ జలసంధిని దాటిన 'సన్మార్ హెరాల్డ్' నౌక జులై 1న ఒడిశాలోని పారాదీప్ పోర్టుకు చేరుకోనుంది. ఈ పరిణామం వెనుక అంతర్జాతీయంగా చోటుచేసుకున్న కీలక దౌత్యపరమైన పరిణామాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల ఒక ఒప్పందం కుదిరింది. జూన్ 18న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం ఇరాన్ తన వద్ద ఉన్న అత్యధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తగ్గించుకోవాలి, ప్రతిగా అమెరికా కొన్ని ఆంక్షలను సడలిస్తుంది. ఈ ఒప్పందం తర్వాత, అదే రోజున హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఉన్న ఆంక్షలను అమెరికా ఎత్తివేసింది. దీంతో నెలల తరబడి స్తంభించిన ఈ మార్గంలో చమురు ట్యాంకర్ల సంచారం తిరిగి ప్రారంభమైంది. దేశీయ ఇంధన అవసరాల కోసం అధికంగా ముడి చమురు దిగుమతులపైనే ఆధారపడి ఉన్న భారత్‌కు, సముద్ర మార్గాల్లో రవాణా నిరంతరాయంగా సాగడం అత్యంత ముఖ్యం. ఈ నౌకలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరడం అనేది ఒకవైపు అంతర్జాతీయ దౌత్య విజయాన్ని, మరోవైపు భారత ప్రభుత్వం తన ఇంధన భద్రతకు, సముద్ర ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సున్నితమైన అంతర్జాతీయ జలాల్లో ప్రయాణించే నౌకలు, సిబ్బంది భద్రత కోసం వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం నిరంతరం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## ఒకేసారి మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ.. రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు

భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే' లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "రక్షణ రంగంలో భారత్ ఇకపై కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోదు. మన సైనిక శక్తి ప్రపంచానికి మార్కెట్‌గా మారకూడదు. మన బలానికి నిర్వచనం ప్రపంచానికి మార్కెట్‌గా మారడంలో లేదు, మన స్వావలంబనలోనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని, ఇదే నవ భారతానికి ఉన్న అతిపెద్ద బలమని ప్రధాని అన్నారు. కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు.

దూనగిరి: ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ వంటి శక్తిమంతమైన ఆయుధాలు, సెన్సార్లతో దీన్ని తీర్చిదిద్దారు. సుదీర్ఘ సముద్ర కార్యకలాపాలకు అనువుగా, బహుముఖ ఆధిపత్యం ప్రదర్శించేలా దీనిని రూపొందించారు.



సంశోధక్: ఇది ఒక భారీ సర్వే నౌక. తీరప్రాంత, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి, రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

అగ్రే: ఇది అర్నాల తరగతికి చెందిన జలాంతర్గామి విధ్వంసక నౌక. తీరప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసేందుకు దీన్ని రూపొందించారు. తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, అత్యాధునిక సోనార్ వ్యవస్థలు దీని ప్రత్యేకతలు.

# మరింత తీవ్రంగా దాడి చేస్తాం... ఇరాన్‌కు ట్రంప్ మరోసారి వార్నింగ్

**లెబనాన్‌లోని అనుకూల గ్రూపులను అదుపు చేయాలని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

**లేదంటే గత వారం కంటే తీవ్రమైన దాడులు తప్పవని స్పష్టం**

**ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లో చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం**

**చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమం, కాల్పుల విరమణపై దృష్టి**

**ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య ఘర్షణలతో ఒప్పందం అమలులో సవాళ్లు**



ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో కీలక చర్చలు జరుగుతుండగానే, మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల గ్రూపుల కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని, లేదంటే గత వారం కంటే మరింత తీవ్రమైన సైనిక చర్య తప్పదని ఆదివారం స్పష్టం చేశారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "లెబనాన్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్న తమ ప్రాక్సీ గ్రూపులను ఇరాన్ వెంటనే ఆపాలి. అలా చేయని పక్షంలో, మేం గత వారం కంటే ఈసారి చాలా గట్టిగా ఇరాన్‌పై దాడి చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు, లెబనాన్ సహా ఇతర ప్రాంతీయ భద్రతా అంశాలపై చర్చించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్విట్జర్లాండ్‌కు చేరుకున్న సమయంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరు దేశాల మధ్య ఈ నెల ప్రారంభంలో ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. అణు అంశాలు, హర్మూజ్ జలసంధి, లెబనాన్‌తో సహా పలు ప్రాంతాల్లో కాల్పుల విరమణపై 60 రోజుల పాటు చర్చలు జరపాలని ఇందులో నిర్ణయించారు. అయితే, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు, హిజ్బుల్లా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగడంతో స్విస్ చర్చలు ఆలస్యమయ్యాయి. లెబనాన్‌లో కాల్పుల విరమణను కాపాడే ప్రయత్నాలపై ఉపాధ్యక్షుడు వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి ఒప్పందాల అమలులో కొన్ని ఇబ్బందులు సహజమేనని, పరిస్థితి సున్నితంగా ఉందని అంగీకరించారు. అధ్యక్షుడు ట్రంప్ తమకు పూర్తి అధికారాలు ఇచ్చారని వెల్లడించారు. ఇరాన్ అణ్వాయుధాలపై ఆశలు వదులుకుంటేనే అమెరికాతో సత్సంబంధాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. శాశ్వత కాల్పుల విరమణకు ట్రంప్ కట్టుబడి ఉన్నారని వాన్స్ ఉద్ఘాటించారు. కాగా, ట్రంప్ తాజా హెచ్చరికలపై ఇరాన్ నుంచి తక్షణమే ఎలాంటి స్పందన రాలేదు.

# నరసాపురంలో దారుణం.. పట్టపగలే యువతి దారుణ హత్య

### సూళ్లూరుపేటోల ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని తిరిగివచ్చిన టీనా రోజా అనే యువతి



**నరసాపురం స్టేషన్ నుంచి**

**స్వగ్రామానికి వెళ్లేందుకు కారు మాట్లాడుకున్న వైనం**

**మార్గమధ్యంలో వాటర్ బాటిల్ కొనేందుకు కిందికి దిగిన యువతి**

**కత్తితో దాడి చేసిన మార్గాని రమేశ్ అనే వ్యక్తి**

**యువతి మృతి... దాడిని అడ్డుకోబోయిన కారు డ్రైవర్ కు గాయాలు**

ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువతిని పట్టపగలే దారుణంగా హత్య చేసిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతురాలిని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన టీనా రోజాగా గుర్తించారు. ఆమె సుళ్లూరుపేటలో ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో నరసాపురం రైల్వే స్టేషన్‌లో దిగి, తన స్వగ్రామానికి వెళ్లేందుకు ఓ కారును అద్దెకు మాట్లాడుకున్నారు. ప్రయాణ మధ్యలో వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు ఓ దుకాణం వద్ద కారు ఆపారు. అదే సమయంలో మార్గాని రమేశ్ అనే వ్యక్తి కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఇది గమనించిన కారు డ్రైవర్ సురేశ్, దుండగుడిని అడ్డుకునే ప్రయత్నంలో గాయపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన టీనా రోజా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.



## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. డ్రైవర్ అప్రమత్తతో 41మంది సేఫ్

కరీంనగర్ : కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

## బొగ్గు మాయం కాలేదు.. ఆరోపణలు నిరాధారం: సింగరేణి యాజమాన్యం

ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది. గనుల్లో బొగ్గు వెలికితీసిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి అంశం డిజిటల్‌గా నమోదవుతుందని కంపెనీ వివరించింది. సుమారు 85 శాతం బొగ్గు రైళ్ల ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని, శాప్ (ఎస్ఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ద్వారా బొగ్గు కేటాయింపులు జరుగుతాయని పేర్కొంది. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వే-బ్రిడ్జ్‌ల వద్ద తూకం వేస్తామని, ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బారియర్లు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత మధ్య బొగ్గు దొంగతనం లేదా మాయం కావడానికి ఆస్కారమే లేదని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి 51:49 వాటాలు ఉన్న సింగరేణి సంస్థలో ఈ ఆరోపణలు కలకలం రేపాయి.




## అట్టహాసంగా ప్రారంభమైన టీజీ20 లీగ్... హాజరైన విజయ్‌దేవరకొండ

**నేటి నుంచి టీజీ20 క్రికెట్ లీగ్**

**ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన పోటీలు**

**ప్రారంభోత్సవంలో సందడి చేసిన బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ**

**తమన్ ప్రదర్శనతో హోరెత్తిన స్టేడియం**

**లీగ్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీయడమే లీగ్ లక్ష్యమని వెల్లడి**

తెలంగాణ క్రీడారంగంలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న క్రికెట్ ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీజీ20 (టీజీ20) లీగ్ ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవ వేడుక అంబరాన్నంటింది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఈ లీగ్ అట్టహాసంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా లీగ్ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ తన లైవ్ పర్ఫార్మెన్స్‌తో స్టేడియాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... హైదరాబాద్, తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆటగాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారని, వీవీఎస్ లక్ష్మణ్ తర్వాత ఆ స్థాయి ఖాళీ ఏర్పడిందని అన్నారు. ఈ టీజీ20 లీగ్ ద్వారా ఎంతో మంది యువ ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చి, ఐపీఎల్, టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ లీగ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఛాంపియన్స్ (ఈటీవీ భారత్) సహా పలు జట్లు పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవం అనంతరం లీగ్‌లో మ్యాచ్‌లు కూడా మొదలయ్యాయి. తెలంగాణలోని యువ క్రీడాకారులకు ఇదొక సువర్ణావకాశమని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే, ఈ లీగ్ నిర్వహణపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) నుంచి కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ, హెచ్‌సీఏ మాత్రం ఈ టోర్నీని విజయవంతంగా ముందుకు నడిపిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీజీ20 లీగ్‌కు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉండి, అవకాశాలు రాని యువతకు ఇది ఒక గొప్ప వేదిక అని ఆయన ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని భట్టి వివరించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి, వారిని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

వాయిస్ టుడే

సోమవారం, జూన్ 22, 2026

# కన్నులపండుగల శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



శాయంపేట(వాయిస్ టుడే): మండలంలోని మైలారం గ్రామంలో శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవాలయ 9వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.ఎమ్మెల్యే కు పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు , ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన దేవాలయాల అభివృద్ధి పనులకు సంపూర్ణ సహకారం అందిస్తూ,ప్రతి ఒక్కరిలో దైవభక్తి పెంపొందిస్తున్నామని అన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాశివుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

**నూతన కమిటీకి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే**

శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ చైర్మన్ గా నియమింపబడ్డ రంగు శ్రీనివాస్ ను అభినందించారు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, దేవాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు విన్నవించారు నూతన కమిటీ బాధ్యులు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చల్లా చక్రపాణి, ఉపసర్పంచ్ మస్కే కుమారస్వామి మరియు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## న్యూ లక్ష్మీపురం గ్రంథాలయ భవన నిర్మాణానికి

# ఎంపీ వద్దిరాజు రవిచంద్ర 15 లక్షల భారీ విరాళం!

### ఎంపీ నిధుల పత్రాన్ని అందుకున్న సర్పంచ్ సలీమా, బీఆర్ఎస్ నాయకుడు ఖాసీం బాబు



ముదిగొండ మండలం జూన్ 21 వాయిస్ టుడే : ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామ విద్యాభివృద్ధికి సరికొత్త బాటలు పడనున్నాయి. గ్రామంలో అత్యాధునిక గ్రంథాలయ భవన నిర్మాణానికి గాను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అత్యంత ఉదారతతో భారీ ఆర్థిక చేయూతను ప్రకటించారు.

న్యూ లక్ష్మీపురంలో గ్రంథాలయం నిర్మించాలనే సర్పంచ్ సలీమా మరియు గ్రామస్థుల ఆకాంక్షను గుర్తించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, తన ఎంపీ నిధుల (MPLADS) నుండి ?15 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన అధికారిక నిధుల మంజూరు పత్రాన్ని ఆదివారం సాయంత్రం న్యూ లక్ష్మీపురం సర్పంచ్ సలీమా బేగం , ఆమె భర్త, ప్రముఖ బీఆర్ఎస్ నాయకుడు ఖాసీం బాబులకు ఎంపీ రవిచంద్ర స్వయంగా అందజేశారు.

**గ్రామాభివృద్ధికి ఎంపీ వద్దిరాజు పూర్తి హామీ**

ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు గ్రంథాలయాలు ఎంతో ప్రయోజనకరంగా మారుతాయని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఇవి దోహదపడతాయని ఆకాంక్షించారు. కేవలం గ్రంథాలయ భవనానికే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో న్యూ లక్ష్మీపురం గ్రామాభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ సలీమా, ఖాసీం బాబులకు ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా ప్రత్యేకంగా హామీ ఇచ్చారు.

**ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ సలీమా, ఖాసీం బాబు**

తమ గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, అడగ్గానే గ్రంథాలయ భవన నిర్మాణానికి ?15 లక్షల భారీ నిధులు కేటాయించినందుకు గాను సర్పంచ్ సలీమా బేగం మరియు బీఆర్ఎస్ నాయకుడు ఖాసీం బాబుల వారి తనయుడు సమీర్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ రవిచంద్ర అందించిన ఈ చేయూతతో న్యూ లక్ష్మీపురం రూపురేఖలు మారడమే కాకుండా, విద్యార్థులకు గొప్ప భవిష్యత్తు లభిస్తుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

# ప్లాస్టిక్ వద్దు మట్టి పాత్రలే ముద్దు: ఎంపీ డీకే అరుణ



వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా జూన్ 21 : పాలమూరు టౌన్‌మట్టి పాత్రలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా పొందవచ్చుని, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగరం లోని మెట్టుగడ్డ లో నాబార్డ్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మొల్లమాంబ పోటరీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, మట్టిపాత్రల విక్రయ కేంద్రాన్ని మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, సంప్రదాయ మట్టి పాత్రలను ప్రోత్సహించడం అవసరమని పేర్కొన్నారు. మట్టి పాత్రల్లో వండిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, పర్యావరణానికి హాని కలగకుండా సహజ జీవనశైలిని ప్రోత్సహిస్తుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు స్థానిక మట్టి కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, సంప్రదాయ కళలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు సుధాకర్ రెడ్డి, గోవింద్ యాదవ్, నాబార్డ్ డిడిఎం షణ్ముఖ చారి , డైరెక్టర్ రజిని, కుమ్మర సంఘం నాయకులు బుగ్గన్న, నాగప్ప, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.







## ఉద్యోగ,పెన్షనర్ల హెల్త్ స్కీమ్ నూతన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలి

**::: టాప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్**

హుజురాబాద్ జూన్ 21 (వాయిస్ టుడే): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణ చారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ,ఉద్యోగ పెన్షనర్ల హెల్త్ స్కీమ్ కు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలను రూపొందించకుండా, సంబంధిత డి డి వో ,ఎస్ టి ఓ లకు కనీసము ఎలాంటి సమాచారము ఇవ్వకుండా ఉద్యోగ పెన్షనర్ల హెల్త్ స్కీమ్ ప్రీమియం గత నెలలో డిడక్షన్ చేయడం సరియైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేసినారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యోగ పెన్షనర్ల హెల్త్ స్కీమ్ ప్రీమియం డిడక్షన్ కు సంబంధించి ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ తో తగు సమీక్ష నిర్వహించి ,నూతన విధి విధానాలను రూపొందించి, తక్షణమే ఉత్తర్వులను జారీ చేయాలని తమ ప్రకటనలో డిమాండ్ చేసినారు. జూలై 2023 నుండి అమలు చేయాల్సిన నూతన పిఆర్సి కి సంబంధించిన నివేదికను ఈరోజు వరకు తెప్పించుకోకపోవడ మే కాకుండా గత మూడు సంవత్సరములుగా పిఆర్సి నివేదిక ప్రకటనను నాన్చుతూ ఉద్యోగ, పెన్షనర్లను తీవ్ర నిరాశ నిస్పృహలకు రాష్ట్ర ప్రభుత్వ పనితీరు గురి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ,పెన్షనర్లను ఆర్థికపరంగా ఇబ్బందులకు గురి చేయకుండా పిఆర్సి నివేదికను ప్రకటించి, జూలై 2023 నుండి నూతన పిఆర్సి ని అమలు అమలు చేయాలని కోరినారు అదే విధంగా ఇప్పటివరకు పెండింగ్ లోనున్న డి ఎ లన్నింటినీ వెంటనే విడుదల చేస్తూ, పెండింగ్ లో ఉన్న బిల్లులన్నింటికీ తక్షణమే నిధులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా మరొక మారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.




## ఉప్పల్ కోర్ట్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం!

వాయిస్ టుడే న్యూస్, జూన్ 21 మేడిపల్లి : మేడిపల్లి లోని ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడిపల్లిలోని ఉప్పల్ కోర్టు ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేశారు. యోగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని పాల్గొన్న వారు పేర్కొన్నారు. యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జూనియర్ న్యాయమూర్తి ముకేష్, రెండవ అదనపు జూనియర్ న్యాయమూర్తి వీరన్న, కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నర్సింగోజు నరేష్ కుమార్,సత్యనారాయణ, సుధాకర్, రాధాకృష్ణ,పవన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ,నాగరాజు, సంధ్యా కిరణ్ , పురుషోత్తం,పలువురు న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో యువకుల చేరిక

రాయికల్ ౹ వాయిస్ టుడే : రాయికల్ పట్టణ గుడేటి రెడ్డి సంఘం లో మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు గారి ఆధ్వర్యం లో బారసా యువ నాయకుడు పడిగెల నరసింహ ,కొత్తపల్లి బిజెపి యువ నాయకులు అరవింద్ బృదం కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులైయి పార్టీలో చేరగా టి పి సిసి సెక్రటరీ బండ శంకర్ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు ,ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు సమానంగా ప్రజలకు అందుతున్నాయి అని జగిత్యాల జిల్లా కేంద్రం విద్య వైద్యానికి హబ్ గా మారింది 235 కోట్ల తో నూతన ఆసుపత్రి నిర్మాణం లో ఉందిఅని .మెడికల్ కాలేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.బీద మధ్యతరగతి వర్గాలకు రాష్ట్రం లో ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది.2ఎకరాల లోపు ఉన్న 90శాతం సన్న కారు రైతులకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి.అని యువత మహిళలు ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలి.వృత్తి విద్యా కోర్సులు,క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం. ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో 2500 మంది విద్యార్థులకు మేలు.రాయికల్ మండల వ్యాప్త అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు మాజీ వైస్ చైర్మన్ రమాదేవి నాయకులు కోల శ్రీనివాస్ పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి కౌన్సిలర్ గంగాధర్ నాయకులు మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## న్యూ లక్ష్మీపురం కస్తూర్బా విద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ముదిగొండ మండలం జూన్ 21 వాయిస్ టుడే : న్యూ లక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆయుష్ డిపార్ట్మెంట్ ముదిగొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నస్రీన్, ఫార్మాసిస్ట్ శ్రీనివాస్ రావు, మరియు ఎం.ఎల్.హెచ్.పి (MLHP) దేవేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం లభిస్తుందని, విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు.అనంతరం యోగా బోధకులు లక్ష్మి, వెంకటేశ్ ల ఆధ్వర్యంలో విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది కలిసి పలు రకాల ఆసనాలు, ప్రాణాయామం చేశారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిరా, పి.ఇ.టి సునీత,ఉపాధ్యాయులు సుజాత, రాధ, స్వాతి మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

మాడుగులపల్లి జూన్ 21 (వాయిస్ టుడే) మండలంలోని కుక్కడం గ్రామం వద్ద డీసీఎం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. స్థానిక ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డి కుంట కు చెందిన ప్రజ్ఞాపురం బిక్షపతి (49) అను వ్యక్తి తన స్కూటీపై వెళుచుండగా కుక్కడం సమీపంలో వెనుక నుండి అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న మృతిని భార్య హేమలత ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ మహమ్మద్ యూసుఫ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు వివరించారు



## సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా వడ్డే సైదిరెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఆరూరి నరేష్

మాడుగుల పల్లి జూన్ 21 (వాయిస్టుడే) : మాడుగుల పెల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా చెరువుపల్లి సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి ప్రధాన కార్యదర్శిగా మాడుగుల పెల్లి సర్పంచ్ ఆరూరి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా మండలంలోని సర్పంచులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిక జరిగిందని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. ఉపాధ్యక్షులుగా రోజా అంజయ్య చిట్యాల సునీత రాయించు జానయ్య కూరెళ్ళ నాగమణి వెంకట చారి అందం రేణుక యాదయ్య కొండేటి జలంధర్ కార్యదర్శులుగా బొబ్బిలి శీను కొత్త దశరథ లు ఎన్నికయ్యారు. పిసిసి ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య రాష్ట్ర నాయకులు చింతకుంట్ల రవీందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి పాశం రామ్ రెడ్డి మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లెంల నరసింహ కట్ట సిద్ధార్థ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు

# మృతుడి పిల్లల విద్యాభ్యాసం కోసం చేయూత

## దాతల సహకారంతో 1,36,000 విరాళం అందజేత



జమ్మికుంట జూన్ 21 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణం లోని పద్మశాలి వీధికి చెందిన ఆడెపు లక్ష్మణ్ ఇటీవల వడ దెబ్బకు మృతి చెందగా మృతుడి పిల్లల ఉన్నత అభ్యాసం కోసం స్థానిక వేద పండితులు డింగరి హరికృష్ణ మాచార్యులు, స్థానిక వ్యాపారి గర్రెపల్లి అరుణ్ మరియు శ్రీ మార్కండేయ గ్రూప్ ఆధ్వర్యంలో దాతల చేయుతతో విద్యా సహాయ నిధిని సేకరించారు. దాతలు 1,36,000 విరాళాలను అందజేయగా ఆదివారం మృతుడి భార్య కావ్య, కుమారుడు కార్తీక్, కూతురు సాహితికి అందజేశారు. సాహితి బీటెక్ రెండవ సంవత్సరం, కుమారుడు 9వ తరగతి విద్యాభ్యాసం చేస్తున్నారు. గుమాస్తాగా పనిచేస్తున్న లక్ష్మణ్ మృతితో పేద కుటుంబానికి సహాయం చేసేందుకు చేయూతనివ్వడంతో కూతురు పేరిట లక్ష రూపాయల ఫిక్స్ డిపాజిట్ పత్రాలను, రూ. 36,000 నగదును అందజేశారు. దాతలు, డింగరి హరికృష్ణ ఆచార్యులు, గర్రెపల్లి అరుణ్, కేదారేశ్వర్,బచ్చు వీరు లింగం, గుడిపాటి వీరారెడ్డి, అరుకాల వీరేశలింగం, విఠల్ దాస్, శ్యాంసుందర్, జి బలరాం, బొద్దుల రవీందర్, బడుగు రవి, బేరీ కిరణ్ తదితరులు చేయూతనిచ్చిన వారిలో ఉన్నారు.

# ఈ నెల 23న పాఠశాల బంద్ విజయవంతం చేయాలి

## గోస్కుల అజయ్ స్టేట్ ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్




హుజూరాబాద్ జూన్ 21 (వాయిస్ టుడే): ప్రభుత్వ పాఠశాలల్లో సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, హాస్టల్లకు పక్కా భవనాలు నిర్మించాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాల బంద్ కు పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ హుజురాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్టేట్ ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ గోస్కుల అజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలకు 23 వేల పాఠశాలలను మూసివేసే కుట్ర రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని, ఆ యొక్క నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస్తువులు మెరుగుపరుస్తూ సాంఘిక సంక్షేమ హాస్టల్ కు పక్కా భవనం నిర్మించి గురుకులాల్లో నాణ్యవంతమైన వసతి అందించాలని వారు తెలిపారు. అలాగే పాఠశాలల్లో ఉదయం టిఫిన్ పెట్టడం త్వరితగతిన ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు నియమ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను వసూలు చేస్తూ పాఠశాల కేంద్రంగా పాఠ్యపుస్తకాలను అమ్ముతున్న విద్యా సంస్థల మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ ఈ పి 2020 ని తక్షణమే అమలు చేయాలని ఈ యొక్క డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని 23న బంద్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు అన్ని పాఠశాలలు స్వచ్ఛందంగా బంధువులు పాల్గొవాలని విద్యార్థిని విద్యార్థులందరినీ కూడా వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి అజయ్,నగర ఉపాధ్యక్షులు సాయి తేజ, అయాన్, సాయి చరణ్, జస్వంత్, తదితరులు పాల్గొనడం జరిగింది.



# చిల్లర్గి ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

వాయిస్ టుడే ఉమ్మడి నిజాంబాద్ జిల్లా ప్రతినిధి జూన్20 : చిల్లర్గి ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాధా మురళి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఆయుష్ వైద్యాధికారి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కార్తిక్, సౌజన్య యోగా ఆసనాలను ప్రదర్శించి ఆరోగ్య పరిరక్షణలో యోగా పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.



# పట్టణ బి జె పి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా యోగా దినోత్సవం

జమ్మికుంట జూన్ 21 (వాయిస్ టుడే): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో యోగా గురువు దాసరి రవిందర్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కొలకాని రాజు, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్ లు మాట్లాడుతూ వేల సంవత్సరాల ముందే యోగులు, రుషులు యోగా ద్వారా శారీరక పుష్టి, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని నిరుపించారు, కానీ బ్రిటిష్, విదేశీ పరిపాలనలో దేశ సంస్కృతి, సంప్రదాయాలను ధ్వంసం చేశారని, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మనదేశం తో పాటు ప్రపంచ దేశాలు కూడా ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను దినచర్యలో భాగంగా పాటించాలని మోడీ ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను తెలిపిన గొప్పవక్తి అని కొనియాడారు. ప్రపంచ దేశాలన్నీ ఈ రోజుని యోగా దినోత్సవంగా పాటిస్తున్నాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో రాజేష్ ఠాకుర్, కైలాసకొటి గణేష్, ఆకుల తిరుపతి, కొండ్లె నగేష్, రాకేష్ ఠాకూర్, రమా రెడ్డి, గంగాభవాని, పల్లపు రవి, నసీరుద్దీన్, బల్సుకూరి రాజేష్, అప్పాల రవిందర్, యాంసాని సమ్మయ్య, గండికోట సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో వినియోగదారుల సమాఖ్య

## స్థానిక ప్రజా ప్రతినిధులుగా వినియోగదారులు




వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 21 : దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి మూడు మాసాల క్రితం ప్రకటించినట్లుగా వరంగల్ నగరపాలక ఎన్నికల్లో 120 స్థానాలకు గాను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలవడానికి 1367 వ్యక్తులను ఎంపిక చేసిందని, సెలెక్టెడ్ కమిటీ కన్వీనర్ , రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డిడి లక్ష్మీనారాయణ అన్నారు. ఆయ వ్యక్తుల వివరాల లిస్టును అందించారని రాష్ట్ర సమాఖ్య అధ్యక్షులు, దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ మొగిలిచెర్ల సుదర్శన్ తెలిపారు. శివనగర్లోని సమాఖ్య కార్యాలయం లో మురహరి కార్తీక్ అధ్యక్షతన ఆదివారం జరిగిన డివిజన్ బాధ్యుల సమావేశం లో దక్షిణ రాష్ట్రాల చైర్మన్ మొగిలిచర్ల సుదర్శన్ తో పాటు వరంగల్ కార్పోరేషన్ అభ్యర్థుల ఎంపిక కమిటీ కన్వీనర్ , రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిడి లక్ష్మీనారాయణ 100 డివిజన్ లకు గాను 1320 సభ్యుల వివరాలను సుదర్శన్ కు అందించారు. కార్యక్రమం లో సుదర్శన్ మాట్లాడుతూ గతం లో ప్రకటించిన విధంగా వరంగల్ కార్పోరేషన్ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అభ్యర్థులను ఇండిపెండెంట్ హోదాలో నిలబేడుతుందని , అందుకు గత నాలుగు మాసాలుగా అభ్యర్థుల ఎంపిక కమిటీ కన్వీనర్ 100 డివిజన్లకు గాను డివిజన్ కి 10 నుండి 14 మంది చొప్పున మొత్తం 1320 ఎంపిక చేసిందని , అందులో బి. సీ, ఎస్. సీ, ఎస్ .టి, మైనారిటీ, మహిళా, విభాగాలు సమానంగా ఉన్నారు. బి. సీ ల్లో ఇప్పటివరకు రాజకీయ ముఖచిత్రం లో లేని వారు, పేద – మధ్య తరగతి అన్ని కులవృత్తుల నుండి చిన్న చిన్న వ్యాపార,ఉద్యోగ రంగాల్లో ఉన్నవారిని , అలాగే మహిళల్లో కూడా అదే విధానంతో ఎంపిక చేయడం జరిగింది అన్నారు. స్థానిక ఎన్నికల్లో పాల్గొనే ఉద్దేశ్యాన్ని వివరిస్తూ. రాజ్యాంగం లో ప్రతి పౌరుడు ప్రజా ప్రతినిధి గా పోటీ చేయవచ్చని, ప్రజల కొరకు, ప్రజల చేత ప్రజల వలన అనే ప్రజాస్వామ్య నిర్వచనాన్ని నేడు కొడుకు కొరకు, కూతురు చేత ,అనుచరుల వలన అనేవిధంగా మార్చి ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యాన్ని తగ్గించారు. పోటీ చెయ్యడానికి కొన్ని కులాలు,వర్గాలు మాత్రమే అన్న పరిస్థితి,నుండి భవిష్యత్ తరాలవారికి అసలైన ప్రజాస్వామ్యం విలువలను తెలియ చెప్పడమే అన్నారు. 1985 లో ఆర్టికల్ 9 లో సవరణలు చేసి పోటీ దారులు ఒక పార్టీగా ,ఒక సమూహంగా ఏర్పడాలని సవరణ చేసినా సంస్థలు, సంఘాలు, పోటీచేయూ వెసులుబాటు అలాగే ఉందన్నారు. వచ్చే వారమే కేంద్ర ఎన్నికల కమిషన్ను కలిసి మా సంస్థ కు ఇండిపెండెంట్ గా ఉన్నా కామన్ సింబల్ కేటాయించి గుర్తించాలని కోరనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు మౌకిక ప్రచారం, గత ప్రజాప్రతినిధులు, కొందరు అవినీతి అధికారుల అక్రమాలు,దోపిడి,తప్పుడు విధానాల వల్ల ప్రజాధనం అంటే మనందరి ఉమ్మడి ధనం ఎలా దోపిడీకి గురైంది, మనకు ఎలాంటి నష్టం జరిగింది, అందుకు మనమే ఎలా కారణమయ్యాము, చిన్న మొత్తానికి మన ఓటు అమ్ముకొని కోట్లాది ప్రజాధనానికి ఎలా దూరమయ్యాము అనే వివరాలు ఆధారాలతో ప్రతి వ్యక్తికి వివరించే ప్రచార విధానము పై త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కేవలం నామినేష డిపాజిట్ తప్ప ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, వ్యక్తిగత ప్రచారమే తప్ప హంగులు ఆర్భాటాలు, ఊరేగింపులు, షో లు ఉండవన్నారు. ఇది ప్రజలకు కూడా ఒక పరీక్ష లాంటిదే, రూపాయి తీసుకోకుండా ఓటు అమ్ముకోకుండా ఓటింగులో ఎంతమంది పాల్గొన్నారనేది ఒక సామాజిక పరీక్ష అని తెలిపారు. సంస్థ తరపున అభ్యర్థుల వివరాలు నామినేషన్ వరకు కూడా గోప్యంగా ఒక స్లీపర్ సెల్స్ టీమ్ గా పనిచేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో లీగల్ అడ్వైజర్ మురారి శెట్టి యశ్వంత్ కుమార్, ఆర్ ఆనందరావు, బండి అనిల్ కుమార్, బత్తిన శ్రీనివాసరావు, కృపాకర్ లు, సభ్యులు చంద్, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యమే మహాభాగ్యం

## ::: డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్



వాయిస్ టుడే ఝరాసంగం జూన్ 21 యోగాభ్యాసం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలుగు రాష్ట్రాల మహా మండలేశ్వర్, సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్తగిరి మ హారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. ఆది వారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశ్రమ వేద పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యోగం భారతీయ ఋషుల మహోన్నత వారసత్వమని, ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా శరీరం ఆరోగ్యవంతంగా, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. ఆశ్రమ నిర్వాహకులు, వేద పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మంచిరామి గ్రామంలో గ్రామదేవతలకు జలాభిషేకం

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్–21 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండలంలోని మంచిరామి గ్రామంలో సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక జలాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి, గ్రామాభివృద్ధి, ప్రజల సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని భక్తులు దేవతలను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు గ్రామస్తులు విశేషంగా పాల్గొని పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ జలాభిషేక కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడమే కాకుండా, గ్రామస్తుల ఐక్యతను, కలిగి సంప్రదాయాల పట్ల ఉన్న భక్తిని ప్రతిబింబించింది..



# మానవ శరీరానికి యోగ ఎంతో అవసరం

## :: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి

వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల, జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాల స్టేడియం గ్రౌండ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జడ్చర్ల జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ, యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధాన మని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్ర శాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచిం చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొని యోగా సాధన చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడు తుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమం అంతర్జాతీయ యోగా దినోత్సవం

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్–21 వాయిస్ టుడే : సుల్తానాబాద్‌లోని ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యోగా ఆసనాలను పరిశీలించి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విశిష్టతను వివరిస్తూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యులు సిలివేరి మహేందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరి శెట్టి తిరుపతి లు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి యోగా ఎంతో అవసరమని తెలిపారు. ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ కోచ్, మాజీ భారత జట్టు ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం క్రీడాకారుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగా ప్రాముఖ్యతను మరింతగా చాటిచెప్పింది. అనంతరం ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, రాజేష్, వాకర్స్ అధ్యక్షులు చొప్పరి సుమన్, ప్రధాన కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్, ఖో ఖో క్రీడాకారులు, విద్యార్థులు క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు..

# అంగరంగా వైభవంగా ధనమైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం





వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 21 : వరంగల్ తూర్పు 34 వ డివిజన్ శ్రీ శివ సాయి కాలనీ లో శ్రీ మెట్ల బావి దాన మైసమ్మ దేవాలయం తృతీయ వార్షికోత్సవం ఆలయ అధ్యక్షులు తోట బాబన్న అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో సుప్రభాతం యాగశాల ప్రవేశం అఖండ దీపారాధన గణపతి పూజ పుణ్యాహవాచనం అంకురార్పణ మొదలైన పూజలతో పాటు సహస్ర కలశంలతో అమ్మవారికి అభిషేకం లక్ష్మీ గణపతి నవగ్రహ హోమం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సుప్రభాతం చండీ హోమం సామూహిక కుంకుమార్చన తోపాటు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం ఉంజల్ సేవ కేరళ బ్యాండ్ మేళతాళాలతో మహిళ భక్తుల కోలాటాలతో శివనగర్ పురవీధుల నుండి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా తోట భావ మాట్లాడుతూ దాతల, భక్తుల సహకారంతో శ్రీ మెట్ల బావి ధన మైసమ్మ దేవాలయం తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు గుండా నాగరాజు, యాద రవి, గజ్జల లింగమూర్తి, మధు, నరసింహమూర్తి, సత్యనారాయణ, వెంకన్న, ప్రసాద్, నరసింహమూర్తి, మోహన్, నరేష్ శ్రీనివాస్, కళ్యాణ్, రాజు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చిట్టిబాబు ,రాజేష్, రాము, సాంబయ్య, సునీల్, నరసింహులు, సదానందం, రవన్న, శ్రీను, విజయ్ కుమార్, రవి, తిరుమలరెడ్డి, ప్రసాద్, అనుదీప్, శశిధర్, శ్రీను, విజయ్ తో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కోటలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



వరంగల్( వాయిస్ టుడే ) జూన్ 21 : 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 ను పురస్కరించుకుని చారిత్రక ఖిలా వరంగల్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయుల వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ చారిత్రక ప్రాంగణంలో జరిగిన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 500 మంది విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది కార్యక్రమం లో పాల్గొని యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,కూడా చైర్మన్ ఏనుగాల వెంకటరామిరెడ్డి లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో అవసరమని అన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని, అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ ఏనుగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి యోగ చాలా అత్యంత కీలకమని ప్రతి ఒక్కరూ జీవన విధానంలో యోగాకు 15 నిమిషాలు అవకాశం ఇచ్చి ఆరోగ్యని కాపాడుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈకార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో ఉమా, నర్సంపేట ఆర్డీవో, డీఆర్వో విజయలక్ష్మి, తహసిల్దార్ ఇక్బాల్ , బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పుష్ప లత, డీపీఆర్వో ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు. ఎన్సీసీకి చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేస్తూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎన్సీసీ కమాండెంట్ భాస్కర్ ధనరాజ్ నాయక్, పురావస్తు శాఖ అధికారి వంశీకృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పాఠశాలల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మైదం రాజు, డిప్యూటీ నోడల్ అధికారులు శ్రీలత, డాక్టర్ అమృతవల్లి, డాక్టర్ మంజుల, జిల్లా కన్వీనర్ డాక్టర్ కె. రాజేందర్, ఆయుష్ శాఖ వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీక అయిన కిలా వరంగల్ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పిన కార్యక్రమంగా ఇది నిలిచింది.

# రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్న ప్రతిపక్ష పార్టీలు

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంయుక్త కమిటీ వేయాలి**

**వైఎస్ఆర్ నగర్ భూములపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి**

**వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాం**

**ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్, బీజేపీ నాయకులు**

**పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని**



హనుమకొండ,వాయిస్ టుడే: ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు పూర్తి నిజాలు చెప్పకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమకారులను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,బీజేపీ నాయకులు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అక్రమ సంపాదనతో కూడబెట్టిన డబ్బుతో ప్రజలకు తాత్కాలిక ప్రయోజనాల పేరుతో వస్తువులు పంపిణీ చేయడం సిగ్గుచేటని..అలాంటి కార్యక్రమాలకు మాజీ మంత్రి హరీష్ రావు హాజరుకావడం బాధాకరమన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులపై దాడులు చేసిన వ్యక్తులే నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమాలను రాజకీయ వేదికలుగా మార్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలి..**

వరంగల్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మాడ వీధుల అభివృద్ధికి రూ.11 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి జూన్ 12న రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయించామని..వాటిని గత ప్రభుత్వ విజయాలుగా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. వరంగల్ నగరంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు,సీపీఐ,సీపీఎం,ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కలిసి సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. నగరంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి హైడ్రా తరహాలో తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**వైఎస్ఆర్ నగర్ పై బీజేపీ,బీఆర్ఎస్ నిరాధార ఆరోపణలు..**

వైఎస్ఆర్ నగర్ భూముల అంశంపై బీజేపీ,బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ భూమి ప్రభుత్వ భూమిగా తేలితే ప్రజా రవాణా, పరిపాలనా అవసరాల కోసం వినియోగించాలని సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం నిధులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మామునూరు విమానాశ్రయం అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలకు అనుమతులు వచ్చిన సమయంలో మామునూరు విమానాశ్రయం కోసం భూసేకరణ పూర్తిచేసినా నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందన్నారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఇటీవల ఇళ్ల పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. మతపరమైన భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న బీజేపీ నాయకులు తెలంగాణకు చేసిన అభివృద్ధి పనులను వివరించాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఎప్పటికీ దుర్వినియోగం చేయనని, ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే తన లక్ష్యమని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. పనిచేసే నాయకులను ప్రజలు ఆదరిస్తారని, అభివృద్ధి చేయలేకపోతే ప్రజలే పక్కన పెడతారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తోందని,మహనీయుల సేవలను స్మరించుకుంటూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

**తెలంగాణ యాంటీ**

**నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య**



హైదరాబాద్, జూన్ 21: యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి పౌరుడు కంకణబద్ధుడు కావాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. నేటి యువత దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి అని, వారు మాదక ద్రవ్యాలపై మళ్లకుండ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరముందన్నారు." డ్రగ్స్ ఫ్రీ-యంగ్ ఇండియా" లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ ఫోర్స్ సహకారంతో ఆదివారం హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియం తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో "శపథ్" పేరుతో యువతకు అవగాహనా మరియు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు సందీప్ శాండిల్య, తెలంగాణ బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ ఎంపి గిరీష్ సంఘీ, ఈగల్స్ ఫోర్స్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణామూర్తి గుప్తా, "శపథ్" నిర్వహణ కమిటీ అధ్యక్షులు రామ్ నివాస్ బన్సల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవేంద్ర శాస్త్రీ, "శపథ్" పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్, సలహాదారులు రాజీవ్ అగర్వాల్, విశాల్ కేడియా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనిల్ సింగ్, ప్యాట్రన్లు అనిరుధ్ గుప్తా, నరేంద్ర గోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్యతెలంగాణలో డ్రగ్స్ వినియోగం ఆందోళనకరమైన స్థాయికి చేరుకుందని, ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పోరాడాలన్నారు. 2019లో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎంఎస్), కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం గంజాయి వినియోగంలో దేశంలోనే తెలంగాణ 28వ స్థానంలో ఉందన్నారు.



## యోగాతో మానసిక ప్రశాంతత

తొర్రూరు, జూన్ 21 వాయిస్‌టుడే : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో నెమరుగొమ్ముల యతి రాజారావు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి రవీందర్ మాట్లాడుతూ యోగా అనేది మానవాళికి చాలా అవసరమని , యోగా మానసిక ప్రశాంతతకు ఆరోగ్యానికి చాలా అవసరమని ప్రతి ఒక్కరూ ప్రతిరోజు దీనిని దినచర్యలో భాగంగా చూడాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరి అని తెలిపారు . వాకర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు, ఎంఈఓ బుచ్చయ్య మాట్లాడుతూ దైనందిక జీవితంలో మానవులు అనారోగ్యానికి మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వీటన్నిటికీ పరిష్కారం యోగా ఆసనాలు, ధ్యానం పరిష్కారమని తెలిపారు .ఈ కార్యక్రమంలో ట్రెజరర్ రాములు, జాయింట్ సెక్రెటరీ మంగమ్మ , యాకుబ్ అలీ,వెంకన్న, కరాటే శ్రీధర్ వీరన్న, రమేష్, యాకూబ్ రెడ్డి, సొమ్ల నాయక్, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## కివి పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు..

వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని అండర్ రైల్వే గేట్ కరీమాబాద్ కివి పబ్లిక్ స్కూల్ లో ఆదివారం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి ప్రారంభించి ఒక ప్రాముఖ్యతను మరియు రోజువారీ జీవితంలో యోగ తప్పకుండా ఒక భాగం కావాలని ఇది విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకుని అన్ని విధాలుగా సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసి రజనీ, కోచ్ రవితేజ,విద్యార్థిని విద్యార్థులు ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు

## ప్రొఫెసర్ జయశంకర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఘన నివాళులు

**జయశంకర్ ఆశయాలు నేటి తరాలకు ఆదర్శం**

**మాజీ ఛీఫ్ విప్,బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్**



హనుమకొండ, వాయిస్ టుడే: తెలంగాణ సిద్ధాంతకర్త,ఉద్యమ ప్రేరణదాత ప్రొఫెసర్ కె.జయశంకర్ వర్ధంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఛీఫ్ విప్,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై ముందుగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఏకశిల పార్క్ జయశంకర్ స్మృతివనంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన జయశంకర్ ఆశయాలు నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆత్మగౌరవం,స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన జయశంకర్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ,మేకల బాబురావు,పార్టీ నాయకులు నయిమొద్దీన్,నర్సింహా స్వామి (చిన్న),ముటిక రాజు,నాయిని రవి,బొల్లు రవి,రామకృష్ణ,రాకేష్,వరుణ్,ప్రణయ్,విజయ్,మహేష్,పులి విక్రమ్,అనిల్,బైరోని వినయ్ తో పాటు తదితరులు పాల్గొని జయశంకర్ సార్ కు నివాళులర్పించారు.



## నాగారంలో ఐదు కాలనీల సంయుక్త సమావేశం

నాగారం, జూన్ 21:-(వాయిస్ టుడే) : నాగారం పరిధిలోని సంతోష్ నగర్ లో ఐదు కాలనీల సంయుక్త సమావేశం ఆదివారం నిర్వహించారు. పార్కులు, ట్రాఫిక్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై నివాసితులు వినతిపత్రాలు అందజేసారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కౌకుట్ల జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని, కొన్ని రెండు రోజులలో పరిష్కారం కానున్నాయని తెలిపారు.

## ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరియు కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్ జూన్ 21(వాయిస్ టుడే ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మహాదేవపురం డివిజన్‌లో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ నవోదయ సిద్దార్థ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయం ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మరియు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి నూతన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో నిస్సహాయులకు, బాధితులకు అండగా నిలవడంలో మరియు మానవ హక్కుల రక్షణలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వ హయాంలో చట్టానికి, మానవ హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా సంస్థ ప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. మహాదేవపురం డివిజన్‌కు విచ్చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ముఖ్య ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్

**పోలీస్ స్టిక్కర్ ఉన్న బైక్ మీద వచ్చిన నిందితులు**

**అనంతరం కాజీపేట**

**బాపూజీనగర్ వద్ద బైక్ వదిలివెళ్లిపోయిన నిందితులు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు**





హనుమకొండ,వాయిస్ టుడే: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ తెలిపారు. ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన పెద్దిరెడ్డి పుష్పలత (69) తన ఇంటి సమీపంలో తమ మనవడితో రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు తెలిపారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. సంఘటన స్థల పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు సిఐ చెప్పారు.

**కాజీపేటలో బైక్ వదలివెళ్లిపోయిన నిందితులు..**

చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసులు రోడ్లపై అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా నిందితులు బైక్ మీద కాజీపేట వైపు వెళ్లారని గుర్తించిన పోలీసులు నిందితులు చైన్ స్నాచింగ్ కు ఉపయోగించిన బైక్ ను కాజీపేటలోని బాపూజీనగర్ చౌరస్తా వద్ద వదిలివెళ్లినట్టు గుర్తించారు. ఆ వాహనంపై పోలీసు స్టిక్కర్ ఉండడంతో అది ఒక కానిస్టేబుల్‌కు చెందిన బైక్ గా గుర్తించి వెంటనే ఫింగర్ ప్రింట్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న ఫింగర్ ప్రింట్స్ క్లూస్ టీం పోలీసులు బైక్ మీద ఉన్న వేలిముద్రలను పరిశీలించారు. ప్రజలు తమ బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్ కుమార్ సూచించారు.

## ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్**



హన్మకొండ,వాయిస్ టుడే: ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా అని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి అన్నారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం--2026 సందర్భంగా ఆదివారం ఉదయం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగ నిపుణుల సమక్షంలో ఆసనాలు,ప్రాణాయామం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన ప్రాచీన వారసత్వమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు,జీవన విధానానికి ప్రతీకగా నిలిచిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాల్లో భాగమైందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో యోగాకు లభిస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ప్రస్తుత జీవనశైలి మార్పుల కారణంగా వెన్నునొప్పి,మెడనొప్పి,మోకాళ్ల నొప్పులు,రక్తపోటు,మధుమేహం వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యలను నివారించడంలో యోగా,ప్రాణాయామం,ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యోగా సాధనకు ప్రత్యేక పరికరాలు,ఖరీదైన జిమ్‌లు లేదా పెద్ద ప్రదేశాలు అవసరం లేదని,ఇంట్లోనే కొద్దిపాటి స్థలంలో ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళలు,కుటుంబ సభ్యులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు యోగా,ప్రాణాయామం,ధ్యానం ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ అనులోమ-విలోమ, భ్రమరి వంటి ప్రాణాయామాలు ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా గురువులు ప్రదర్శించిన వివిధ ఆసనాలు ఆకట్టుకున్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో యోగా సాధన చేస్తే శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆయుష్ శాఖ, క్రీడా శాఖ,యోగా శిక్షకులు,అధికారులు,సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. యోగాను దినచర్యలో భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ దుర్గా రామ్ కుమార్,డివైఎస్‌ఓ ప్రశాంత్,డీపీఆర్ ఓ ఆయూబ్ అలీ,బోద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,విష్ణువర్ధన్,సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ మహేందర్ కుమార్,ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భాను,డిప్యూటీ నోడల్ అధికారి డాక్టర్ జి. రాము,డాక్టర్ శోభారాణి,డాక్టర్ సతీష్,డాక్టర్ కుమారస్వామి,డాక్టర్ మమతా మాధవి,ఇన్‌స్పెక్టర్లు ప్రభు చైతన్య,రాజేందర్,వైద్య ఆరోగ్యశాఖ,ఆయుష్,జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది, క్రీడాకారులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# SIR అప్లికేషన్ పట్ల అవగాహన కల్పించేందుకు 2K రన్

**2K రన్ లో పాల్గొన్న ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు,అధికారులు**

**సమాజ శ్రేయస్సు కోసం యువత,ప్రజలు భాగస్వాములు కావాలి**

హనుమకొండ,వాయిస్ టుడే: ?వరంగల్ నగరంలో ప్రజలకు 'సర్' (SIR) అప్లికేషన్ లేదా ప్రాజెక్ట్ పట్ల అవగాహన కల్పించేందుకు వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్ నాగరాజు,వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యాశారదా దేవి,హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి లతో కలిసి ఉత్సాహభరితమైన 2కే రన్ పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన సమగ్ర జిల్లా కార్యాలయాల సముదాయం నుండి చారిత్రాత్మక కాశిబుగ్గ సర్కిల్ వరకు ఈ 2ఎ రన్ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వరంగల్ అభివృద్ధిలో అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారని..సమాజ శ్రేయస్సు కోసం యువత,ప్రజలు ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సౌకర్యార్థం మరియు పారదర్శకమైన సేవల కోసం ఉద్దేశించిన 'సర్' విధానాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావడంలో ఇలాంటి రన్ లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ 2కే రన్‌లో వరంగల్,హనుమకొండ జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు,సిబ్బంది, స్థానిక యువకులు,క్రీడాకారులు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.





## 47 వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి

కుత్బుల్లాపూర్, జూన్ 21(వాయిస్ టుడే ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ, జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ దగ్గర, నిర్వహించిన 47 వ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ఎ సి ఎస్ చైర్మన్ నరేందర్ రాజు , మాజీ ఎంపీటీసీ మల్లేష్, మాజీ కౌన్సలర్ శివకుమార్ గౌడ్, భాస్కర్ గౌడ్, బోగారం వెంకటేష్, ఐలేష్ యాదవ్, దప్పు నరేందర్, సాధు యాదవ్, శివారెడ్డి, సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు మరియు టీమ్ బికెఆర్ సభ్యులు పాల్గొన్నారు.



### అమ్మవారి కృప కరుణ కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్ జూన్ 21(వాయిస్ టుడే ) : 126 – జగద్గిరిగుట్ట డివిజన్ సీసల బస్తిలోని శ్రీ వైష్ణవి దుర్గ దేవాలయంలో జై గురు నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... శ్రీ వైష్ణవి దుర్గా అమ్మవార్ల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, జై గురు నవదుర్గ సేవాసమితి ట్రస్ట్ సభ్యులు శ్రీకాంతాచార్యులు, జైహింద్, రాఘువేందర్, కపిరాజు, రంగనాథ్, కర్ణ, నాయకులు మల్లేష్ గౌడ్, పాపి రెడ్డి, విటల్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, దాసు, రమేష్, ప్రభాకర్, మెట్ల శీను, దాసు, విగ్నేష్, ముంతాజ్, సంతోష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



### జిల్లాలో ప్రశాంతంగా నీట్ పరీక్షల నిర్వహణ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ,వాయిస్ టుడే: హనుమకొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (NEET) పరీక్ష ప్రశాంతంగా,ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 4196 మంది అభ్యర్థులకుగాను 3764 మంది హాజరయ్యారు. 432 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కాగా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పరీక్ష కేంద్రానికి ఎంతమంది అభ్యర్థులకు గాను ఎంతమంది హాజరయ్యారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టి,అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సాఫీగా పూర్తి కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన అధికారులు,పోలీస్ సిబ్బంది,సంబంధిత శాఖల సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



## నాగారంలో యోగా దినోత్సవం

నాగారం, జూన్ 21:-(వాయిస్ టుడే) : నాగారం మున్సిపాలిటీలోని హిమాలయన్ యోగాలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
సోమవారం, జూన్ 22, 2026

### గాంధీభవన్‌లో సంఘటన్ సృజన్ అభియాన్ మరియు ఎస్ఐఆర్‌పై జరిగిన సమావేశంలో పాల్గొన్న

## కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 21(వాయిస్ టుడే) : గాంధీ భవన్ లో పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ మరియు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో సర్ మరియు బిఎల్ఎ ల శిక్షణ పై పార్లమెంట్ కోఆర్డినేటర్స్ సమావేశాన్ని నిర్వహించారు, ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ మరియు మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ సర్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం, ఓటు మ్యాపింగ్ మరియు ( బి ఎల్ ఎ ) బిఎల్ఎ ల పాత్ర గురించి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు తీసుకోవలసిన అంశాలు మరియు అనుసరించాల్సిన విధానంపై పార్లమెంట్ కోఆర్డినేటర్స్ కి దిశ నిర్దేశం చేశారు, సర్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బూతు లెవల్ ఏజెంట్లు అలసత్వం వహించకుండా ప్రతి ఇంటి తలుపు తడుతూ నకిలీ ఓట్లను తొలగింపు తో పాటు 18 సంవత్సరాలు నిండిన నూతన యువతి యువకులకు ఓటు హక్కును నమోదు చేసే విధంగా బిఎల్ఎలు కృషి చేసే విధంగా చూడాలని కోఆర్డినేటర్స్ కి తెలియజేశారు. అనంతరం మాజీ శాసనసభ్యులు కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ మరియు బిఎల్ఎ ల శిక్షణ గురించి పూర్తి వివరాలను ఎఐసిసి ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ మరియు మహేష్ గౌడ్ పార్లమెంట్ పరిధిలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని విషయాలతో పాటు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని మండల కమిటీలు, డివిజన్ కమిటీ,




మున్సిపల్ వార్డు కమిటీలు గ్రామ కమిటీల,నియామకాల గురించి వివరంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సెక్రెటరీ సచిన్ సావంత్ మరియ పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ రెడ్డి సురేష్ షెట్కర్, రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు..



## 47 వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్, జూన్ 21(వాయిస్ టుడే ) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ, జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ దగ్గర, నిర్వహించిన 47 వ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, దుల్లపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ఎ సి ఎస్ చైర్మన్ నరేందర్ రాజు , మాజీ ఎంపీటీసీ మల్లేష్, మాజీ కౌన్సలర్ శివకుమార్ గౌడ్, భాస్కర్ గౌడ్, బోగారం వెంకటేష్, ఐలేష్ యాదవ్, దప్పు నరేందర్, సాధు యాదవ్, శివారెడ్డి, సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు మరియు టీమ్ బికెఆర్ సభ్యులు పాల్గొన్నారు.

## వివిధ శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ జూన్ 21(వాయిస్ టుడే ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ చర్చ్ గాగిల్లాపూర్ నివాసులు సందీప్ రెడ్డి నూతన గృహప్రవేశంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. గాగిల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు మధు నివాసంలో జరిగిన హోమం మరియు ప్రత్యేక పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గాగిలాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన స్వాగ్ ఫ్యామిలీ సెలూన్ షాప్ ను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు సేవలను అందించి వారి నుండి మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. శంభీపూర్ లోని శంభీపూర్ నివాసులు వడ్డే విట్టల్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు. శంభీపూర్ లోని కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ లో గడ్డపోతారం మున్సిపాలిటీ కిష్టయ్యపల్లి నివాసులు మల్లికార్జున్ కుమార్తె మరియు కుమారుని నూతన వస్త్రాలంకరణ పుట్టుపంచల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆశీర్వదించారు. గండిమైసమ్మ గాయత్రి నగర్ కమ్యూనిటీ హాల్ లో బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ నివాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంశీ చారి కుమార్తె మరియు కుమారుని నూతన వస్త్రాలంకరణ పుట్టుపంచల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆశీర్వదించారు. పటాన్చెరు నియోజకవర్గ జిన్నారం మండలం మాదారంలోని కోలన్ అనంత



రెడ్డి గార్డెన్స్ లో గడ్డపోతారం మున్సిపాలిటీ కాజిపల్లి నివాసులు సంగు మురళి ముదిరాజ్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు..



## నాగారంలో యోగా దినోత్సవం

నాగారం, జూన్ 21:-(వాయిస్ టుడే) : నాగారం మున్సిపాలిటీలోని హిమాలయన్ యోగాలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

## భారతీయ జనతా పార్టీ సిఎంసీ 295 బౌరంపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్ జూన్ 21(వాయిస్టుడే) : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బౌరంపేట డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో సింహపురి కాలనీ గణపతి పార్క్ లో యోగ దినోత్సవం నిర్వహించడం జరిగింది యోగ శిక్షకులు కృష్ణారెడ్డి రాజేశ్వరి ప్రోటోకాల్ వివిధ ఆసనాలు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటి సారి అంతర్జాతీయ స్థాయిలో యోగాను గుర్తింపు తేవడం జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ఐక్యరాజ్యసమితిలో ప్రకటించడం జరిగింది ఎందరో మహా ఋషులు మనులు యోగులు ప్రకృతిని ( పుష్పమైనటువంటి పద్మం పద్మాసన్, జలచరాలు మచ్యసన్,కూర్మాసన్, భూమి మీద నివసించే సర్పాసన్,గోముఖాస్సన్, వృక్షాసన్) ఇలా ఎన్నో ప్రకృతినిమానవ శరీరంలో ఇనుమడింపజేసి మనిషిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వర్ధిల్లాలని తీర్చిదిద్దిన పురాతన సంపద యోగను గుర్తు చేసుకుని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు దినచర్యలో భాగంగా మనం మరి మన భావితరాలకు కూడా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది యోగాకు ప్రత్యేక గుర్తింపు వచ్చిన తర్వాత ప్రైవేటు మరియు ప్రభుత్వం తరపున యోగా టీచర్లుగా ఎంతోమందికి జీవనోపాధి కూడా లభించడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గోనే మల్లారెడ్డి,డి సీతారాం రెడ్డి, శివ ప్రసాద్ పరికి ప్రమోద్ కుమార్, నల్ల రాజిరెడ్డి, వై శ్రీనివాస్




రెడ్డి,అందే అశోక్,ఎం అతీష్ బాబు, కొమ్ము ప్రశాంత్, బాల శ్రీకాంత్,సాయికిరణ్, రామ్ కుమార్,సుధాకర్, బాలకృష్ణ సింహపురి కాలనీ అధ్యక్షులు నరసింహారెడ్డి కాలనీవాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## రాంపల్లి సాహితి కాలనీ రోడ్డు మూలమలుపు సమస్య పరిష్కారించాలి

నాగారం, జూన్ 21:-(వాయిస్ టుడే) : నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి సాహితి కాలనీలో రోడ్డు మలుపు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు కౌకుంట్ల జీవన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కౌకుంట్ల జీవన్ రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకొని, రోడ్డు వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, సాహితి కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్న ప్రతిపక్ష పార్టీలు

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంయుక్త కమిటీ వేయాలి**

**వైఎస్ఆర్ నగర్ భూములపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి..**

**వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది..**

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాం..**

**ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్, బీజేపీ నాయకులు...**

**పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని..**



హనుమకొండ,వాయిస్ టుడే: ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు పూర్తి నిజాలు చెప్పకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమకారులను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,బీజేపీ నాయకులు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అక్రమ సంపాదనతో కూడబెట్టిన డబ్బుతో ప్రజలకు తాత్కాలిక ప్రయోజనాల పేరుతో వస్తువులు పంపిణీ చేయడం సిగ్గుచేటని..అలాంటి కార్యక్రమాలకు మాజీ మంత్రి హరీష్ రావు హాజరుకావడం బాధాకరమన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులపై దాడులు చేసిన వ్యక్తులే నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమాలను రాజకీయ వేదికలుగా మార్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలి..**

వరంగల్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మాడ వీధుల అభివృద్ధికి రూ.11 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి జూన్ 12న రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయించామని..వాటిని గత ప్రభుత్వ విజయాలుగా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. వరంగల్ నగరంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు,సీపీఐ,సీపీఎం,ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కలిసి సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. నగరంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి హైడ్రా తరహాలో తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**వైఎస్ఆర్ నగర్ పై బీజేపీ,బీఆర్ఎస్ నిరాధార ఆరోపణలు..**

వైఎస్ఆర్ నగర్ భూముల అంశంపై బీజేపీ,బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ భూమి ప్రభుత్వ భూమిగా తేలితే ప్రజా రవాణా, పరిపాలనా అవసరాల కోసం వినియోగించాలని సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం నిధులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మామునూరు విమానాశ్రయం అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలకు అనుమతులు వచ్చిన సమయంలో మామునూరు విమానాశ్రయం కోసం భూసేకరణ పూర్తిచేసినా నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందన్నారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఇటీవల ఇళ్ల పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. మతపరమైన భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న బీజేపీ నాయకులు తెలంగాణకు చేసిన అభివృద్ధి పనులను వివరించాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఎప్పటికీ దుర్వినియోగం చేయనని, ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే తన లక్ష్యమని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. పనిచేసే నాయకులను ప్రజలు ఆదరిస్తారని, అభివృద్ధి చేయలేకపోతే ప్రజలే పక్కన పెడతారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తోందని,మహనీయుల సేవలను స్మరించుకుంటూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.



## మానవత్వం చాటుకున్న బోరబండ ఎస్సై నాగుల్ మీరా

జూబ్లీహిల్స్..21 జూన్ (వాయిస్టుడే) : కళ్యాణ్ నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ (మూర్ఛ) రావడంతో రోడ్డుపై కుప్పకూలిపోయాడు. ఆ సమయంలో అక్కడి నుంచి వెళ్తున్న బోరబండ నాగుల్‌మీరా ఎస్సై ఘటనను గమనించి వెంటనే స్పందించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని లేపి, ప్రథమ చికిత్సలో భాగంగా అతని చేతిలో ఐరన్ రాడ్ ఉంచి గాలి ఊదుతూ స్పృహలోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. అనంతరం స్థానికుల సహకారంతో బాధితుడిని సురక్షిత ప్రాంతానికి తరలించి మెరుగైన వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు. ఎస్సై సకాలంలో స్పందించి బాధితుడి ప్రాణాలను కాపాడేందుకు చేసిన కృషిని స్థానిక ప్రజలు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి వెంటనే సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్న బోరబండ ఎస్సై సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు.

# MDR ఫౌండేషన్‌కు 23వ జాతీయ అవార్డు.. సేవా కార్యక్రమాలకు జాతీయస్థాయిలో గుర్తింపు

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం, వాయిస్‌టుడే న్యూస్ పటాన్ చెరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన "పర్యావరణ మిత్ర నేషనల్ అవార్డ్స్ -- 2026" కార్యక్రమంలో MDR ఫౌండేషన్‌కు జాతీయ అవార్డు లభించింది. ఈ అవార్డును హర్యానా మరియు హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, జాతీయ చైర్మన్ డా. యామినేని ఉప్పలరావు, సినీ నటి పూజిత జొన్నలగడ్డ, అంతర్జాతీయ మోడల్ ఆశ్రిత రొయ్యూరు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పటాన్‌చెరు కేంద్రంగా గత ఎన్నో సంవత్సరాలుగా వీణ= ఫౌండేషన్ నిర్వహిస్తున్న అనాథ శవాల అంత్యక్రియలు, పేదలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం, వైద్య సహాయం, రేషన్ కిట్ల పంపిణీ, సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా MDR ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, "వీణ= ఫౌండేషన్‌కు లభించిన 23వ జాతీయ అవార్డును గౌరవంగా స్వీకరిస్తున్నాం. ఇది మా సేవా బాధ్యతను మరింత పెంచింది. ప్రజల ఆశీర్వాదాలు, సహకారంతో ముస్ముందు కూడా మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. సేవే లక్ష్యంగా... సమాజ హితం కోసం వీణ= ఫౌండేషన్ ప్రయాణం నిరంతరం కొనసాగుతుంది.



# ఎమ్మెల్యే జిఎంఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన పెన్నార్ బిఆర్టియు నాయకులు

## పెన్నార్ కార్మిక లోకానికి సంపూర్ణ మద్దతు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం వాయిస్ టుడే న్యూస్ పటాన్‌చెరు : శనివారం జరిగిన పెన్నార్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో తమ హ్యాట్రిక్ విజయానికి సంపూర్ణ సహకారం అందించిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డికి బి ఆర్ టి యు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని కలిసి పుష్పగుచ్ఛం అందించి.. మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గత మూడు పర్యాయాలుగా బి ఆర్ టి యు నాయకత్వాన్ని బలపరిచి హ్యాట్రిక్ విజయాన్ని అందించిన పెన్నార్ పరిశ్రమ కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని కార్మిక నాయకులకు సూచించారు. తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని.. కార్మికుల భవిష్యత్తుకు ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు, పెన్నార్ పరిశ్రమ అధ్యక్షులు రాంబాబు యాదవ్, మాజీ ఎంపీపీ, పెన్నార్ పరిశ్రమ కార్యనిర్వాహక అధ్యక్షులు యాదగిరి యాదవ్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.



# చిన్న కంజర్లలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు షాక్

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన 50 మంది నాయకులు, కార్యకర్తలు

## రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే.. ప్రజాకంటక ప్రభుత్వానికి త్వరలోనే చరమగీతం

పటాన్చెరు : ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలకు చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్ ఊర్మిళ వెంకట్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డిల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో .. 50 మంది కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం ప్రజలకు అర్థమైందని.. అతి త్వరలోనే ప్రజలు చరమగీతం పాడతారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకపోగా హైడ్రా పేరుతో విధ్వంసం సృష్టిస్తోందని విమర్శించారు. గత రెండున్నర సంవత్సరాలుగా పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో అధికార కాంగ్రెస్ పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంతో తిరిగి



రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన విజయ్ సింగ్, హనుమంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సాయి, నరేష్ ఈశ్వర్, రాజు, లోకనాథ్ సింగ్, కిరణ్, నబీ, తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఇంద్రేశం మున్సిపల్ కౌన్సిలర్లు ఊర్మిళ వెంకట్ రెడ్డి అంతిరెడ్డి, దుర్గారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శివారెడ్డి, సల్మాన్, సీనియర్ నాయకులు రామచందర్, దుర్గేశ్, సాయికిరణ్ చారి, తదితరులు పాల్గొన్నారు.



# దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం లోని శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేడుకలకు హాజరైన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల నుంచి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాశ మైలారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ సరిత సుధాకర్ గౌడ్, గ్రామ ప్రజలు పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# అల్లాపూర్‌లో ఘనంగా లాల్ షా ఉర్ఫ్ మౌలా బాబా 46వ ఉరుస్ సందల్ మహోత్సవం

అల్లాపూర్.. 21 జూన్( వాయిస్ టుడే ) : అల్లాపూర్ హమాల్ బస్తీ, పండిట్ నెహ్రూ నగర్‌లో హజ్రత్ లాల్ షా ఉర్ఫ్ మౌలా బాబా వారి 46వ వార్షిక ఉరుస్ సందల్ మహోత్సవం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏ. లక్ష్మణ్ గౌడ్ చద్దర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఖురాన్ ఖానీ, ఫాతేహా కార్యక్రమాలు నిర్వహించి దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక దువాలు చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ సలీమ్, అబ్దుల్ సలాం, షేక్ రహీముద్దీన్, మొయినో పటేల్, మతీన్, ముస్తఫా తదితరులు పాల్గొని సందల్ ఊరేగింపును విజయవంతం చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మౌలా బాబా ఆశీస్సులు పొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు నియాజ్ పంపిణీ చేసి ఉరుస్ మహోత్సవాన్ని భక్తిపూర్వక వాతావరణంలో ముగించారు. ఈ కార్యక్రమంలో నర్సింహా గౌడ్.. మరియు కార్యకర్తలు పాల్గొన్నారు





యోగ దినోత్సవానికి 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21 రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించినప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు సుజన హిత యోగా సొసైటీ యోగా కార్యక్రమాలు ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుజనా హిత యోగ సొసైటీ చైర్మన్ ఎబులూరి చలపతిరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారత విదేశాంగ శాఖ కార్యాలయాలు ఉన్న వివిధ దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యోగ అనేది మానవ జీవితంలో అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న అంశమని ఆయన అన్నారు. భారతీయ అతి ప్రాచీన సంస్కృతిలో భాగంగా ఉన్న యోగాను ప్రధాని మోడీ ప్రపంచానికి పరిచయం చేశారని స్పష్టం చేశారు. మానసిక ప్రశాంతతకు శారీరక ఉల్లాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా రోజున విధిగా యోగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అనురాధ అడ్వైజర్ ప్రభాకర్ మాదికర్ వైస్ ప్రెసిడెంట్ .రఘునందన్, నాయుడు,ప్రేమలత జనరల్ సెక్రెటరీ సుమిత్ పట్నాయక్ జాయింట్ సెక్రెటరీ యం.సుభాష్ ,నాగరాణి ట్రెజరర్ వీరేశం ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కృష్ణమూర్తి ,ఆంజనేయులు ,నరసింహులు, అశోక్ ,వెంకట్రావు,అనంత చారి,శశిధర్ రెడ్డి, వెంకటాచారి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఈ రోడ్డు బాగుచేయండి....

నాగారం, జూన్ 21:-(వాయిస్ టుడే) : దమ్మైగూడ - నాగారం ప్రధాన రహదారి చెరువును తలపిస్తున్న పరిస్థితి. ఈ రోడ్డు ను తక్షణమే మరమ్మత్తు చేయాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఈ రోడ్డు పై నుండి ప్రవాహం పొంగి పొర్లతుండటంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పెద్ద పెద్ద గుంతలతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో గుంతల లోతు తెలియక వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిందపడిపోయి గాయాల పాలవుతున్నారు. తక్షణమే రోడ్డు పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ 21 జూన్ (వాయిస్ టుడే) ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్‌నగర్ హిమకీర్తి అపార్ట్‌మెంట్‌లో కళ్లెం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర పరీక్షల శిబిరంలో పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఉచిత కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందడం ద్వారా దృష్టి లోపాలను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు,సదాశి యాదవ్..ఎర్ర కృష్ణ.. వీర కుమార్..రాఘవ రెడ్డి.... మోసిన్ కురేషి.. అత్తారి అనంతయ్య..జవహర్.. రవి గౌడ్. రాజకుమార్ గౌడ్.. గంట మల్లేష్.. గాఫుర్..రాజశేఖర్ ..నిర్వాహకులు, వైద్య సిబ్బంది, అపార్ట్‌మెంట్ నివాసులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతాం: ఆర్ కృష్ణయ్య

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో రుద్రారం- జాతీయ బిసి సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ని రుద్రారం వద్ద మర్యాదపూర్వకంగా కలిసిన బిసి విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 8 9 వెంటనే రద్దు చేసి పాత పద్ధతిలోనే ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలను ఇవ్వాలని మరియు అదే విదంగా ప్రభుత్వ పాఠశాలను మూసి వేసే నిర్ణయాన్ని వెనెక్కి తీసుకోవాలని అన్నారు. జిల్లాలో త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు వెంకట్, సంతు, మహమ్మద్ తదతరులు పాల్గొన్నారు.

# ఉషోదయ కాలనీలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

## ప్రతి నెలా రెండు సార్లు ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం

## వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించినట్లు అధ్యక్షుడు సతీష్ బాబు



కుత్బుల్లాపూర్ : జూన్ 21(వాయిస్ టుడే) ఉషోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీ పార్కులో నిర్వహించిన యోగా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీ ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవం, ఫాదర్స్ డే మరియు ప్రపంచ సంగీత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ గానగంధర్వుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ యోగా శిక్షకులు వెంకటేష్, బసవరాజు పాల్గొని యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలు, జీవనశైలిలో అనుసరించాల్సిన ఆరోగ్య చిట్కాలపై అవగాహన కల్పించారు. వారి మార్గదర్శకత్వంలో నిర్వహించిన యోగా సాధనకు కాలనీవాసులు విశేష స్పందన చూపారు. దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 నుంచి 300 మంది కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ ఉషోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని మరింత పెంపొందించేందుకు



ప్రతి నెలా రెండు సార్లు నిపుణులైన యోగా గురువులతో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించినట్లు అధ్యక్షుడు సతీష్ బాబు తెలిపారు. మహిళలు, యువత, వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

కూకట్‌పల్లి: జూన్ 21(వాయిస్ టుడే) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ ఐక్యవేదిక సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బశెట్టి నర్సింగ్ రావు, తూము నర్సింగ్ రావు, నారాయణ, బశెట్టి ప్రభాకర్, రవి, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ భావజాలానికి మార్గదర్శకుడిగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమాన సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, త్యాగస్ఫూర్తి, తెలంగాణ పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకుంటూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# భరత్‌నగర్‌కాలనీలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



## కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్

కూకట్‌పల్లి: జూన్ 21(వాయిస్‌టుడే) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భరత్ నగర్ కాలనీలో ఆదివారం ఉదయం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ యోగా సాధన చేస్తున్న రామకృష్ణ, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, దామోదర్ నాయుడు, భాస్కర్, పండుగ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగా మాస్టర్లు నరేందర్, హరి యోగా ఆసనాలు చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, బిక్షపతి, విజయ్ కుమార్, బలరాం, బుచ్చిబాబు, నరేష్ కుమార్, రత్నారావు, ఆనంద్, సోమయ్య, శ్రీనివాస్, మాణిక్ రెడ్డి అంబటి, రామ్మోహన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధనను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# నాన్న చూపిన మార్గమే నా జీవితానికి దిక్సూచి




## మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు భావోద్వేగం

మెదక్ :వాయిస్ టుడే : డి.వి. శ్రీనివాసరావు తన జీవిత ప్రయాణంలో తండ్రి పాత్రను గుర్తుచేసుకుంటూ భావోద్వేగంగా స్పందించారు. "నా ప్రతి అడుగు నాన్న చూపిన మార్గమే" అని ఆయన అన్నారు. తండ్రి కొండల్రావు గారు గణిత ఉపాధ్యాయుడిగా ఉన్నత విలువలతో ముగ్గురు పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా విద్యే గొప్ప ఆస్తి అనే నమ్మకంతో ఆయన ఇచ్చిన ప్రోత్సాహమే తమ విజయాలకు కారణమని చెప్పారు. చిన్నప్పటి నుంచే గణితంలో బలమైన పునాది వేసిన తండ్రి మార్గదర్శకత్వంతోనే తాను గ్రూప్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించానని, ఆత్మవిశ్వాసాన్ని నింపిన వ్యక్తి తన తండ్రేనని పేర్కొన్నారు. గ్రూప్-1 అధికారిగా ఎంపికైన రోజు తండ్రి ఆనందం తన జీవితంలో మరువలేని క్షణమని గుర్తుచేసుకున్నారు. అయితే తాను జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని తండ్రి చూడలేకపోవడం జీవితంలో తీరని లోటుగా మిగిలిందని భావోద్వేగం వ్యక్తం చేశారు. తండ్రి నేర్పిన విలువలు, క్రమశిక్షణ, ఆలోచనా విధానం తన ప్రతి నిర్ణయంలో కనిపిస్తాయని చెప్పారు. తన ప్రతి విజయానికి మొదటి హక్కు తన తండ్రిదేనని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



# జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

కంటోన్మెంట్: జూన్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి) : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా న్యూ బోయిన్పల్లి జయ నగర్ కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆర్టిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, బి ఆర్ఎస్ నాయకులు, టింకు గౌడ్ బోయిన్పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కాంగ్రెస్ నాయకుడు అరుణ్ యాదవ్, ఓం ప్రకాష్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జయశంకర్ అందించిన స్ఫూర్తితోనే ప్రత్యేక రాష్ట్ర కాంక్ష నెరవేరినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులు,కష్టాలను కళ్లారా చూసి ప్రత్యేక రాష్ట్రం వస్తేనే తెలంగాణ ప్రజల హక్కులు కాపాడబడతాయని నమ్మి తన సిద్ధాంతాన్ని ప్రజలకు తెలియపరచిన మహనీయుడుగా ఆయనను కీర్తించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని వారు అన్నారు.



# ఘనంగా బీజేవైఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి,: జూన్ 21(వాయిస్ టుడే ) బీజేవైఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో నాగేష్, భాస్కర్, రమేష్, నిఖిల్, దేవేందర్, బాలు, ఫయాజ్ తదితరులు పాల్గొని క్రాంతికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రాంతికుమార్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.



# కోటి రాణి పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ, ఆర్ఎస్ఎస్ మహావీర్ శాఖ, రాణి పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్కులో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఆరోగ్యకరమైన మనస్సు, శరీరం కోసం యోగా ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి ప్రజలు, స్వచ్ఛంద కార్యకర్తలు ఏకమై ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు హన్మంత్ రావు, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆర్. లక్ష్మణ్ రావు, రాము, మహేష్, కృష్ణ, హనుమంత్ రావు, పాండే, బసవరాజ్, ఇతర ప్రముఖులు యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. యోగాను ఒక జీవన విధానంగా స్వీకరించి, ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడతామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

# ఖమ్మంలో తీవ్ర విషాదం ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం



కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ తల్లి తన ఇద్దరు బిడ్డలకు విషమిచ్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్యకు యత్నించింది. ఈ దారుణ ఘటనలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, తల్లి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఖమ్మం నగరంలోని గాంధీ నగర్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. బొబ్బల లింగరాజు, స్వాతి (26) దంపతులకు వేదిక్ కుమార్ (7), తనుష్ (5) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగరాజుకు మద్యం తాగడం, బెట్టింగ్‌లు కాయడం వంటి దురలవాట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. భార్య తండ్రి దొడ్డ పూర్ణయ్య ఇచ్చిన నగదును కూడా బెట్టింగ్‌లో పోగొట్టడంతో ఆ కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి పెద్ద కుమారుడు వేదిక్‌కు తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వేదిక్ మృతి చెందాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే చిన్న కుమారుడు తనుష్ కూడా అదే లక్షణాలతో ఆదివారం ప్రాణాలు విడిచాడు. పిల్లలకు తానే ఎలుకల మందు ఇచ్చానని, అనంతరం తాను కూడా తీసుకున్నానని స్వాతి తన భర్తతో చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం స్వాతి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. తన కుమార్తె ఈ దారుణానికి పాల్పడటానికి భర్త లింగరాజు వేధింపులే కారణమని స్వాతి తండ్రి పూర్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఖమ్మం మూడో పట్టణ పోలీసులు లింగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫాదర్స్ డే రోజే ఈ విషాదం చోటుచేసుకోవడం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది.